విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

శుక్రవారం 04, ఏప్రిల్ -2025 4 పేజీలు

నేడే మంత్రి పార్థసారథి జిల్లాకు రాక

విశాలాంధ్ర- నెల్లూరు (కలెక్టరేట్) : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. డీపీఆర్వో తెలిపారు ఉదయం 8.30 గంటలకు నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలోని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాసానికి మంత్రి పార్థసారథి చేరుకుంటారు. అనంతరం 9.30 గంటలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి తో కలిసి తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్ ను మంత్రి పరిశీలించి లబ్ధిదారులతో మమేకమవుతారు. ఉదయం 11:30 గంటలకు మంత్రి పొదలకూరులో హౌసింగ్ లేఅవుట్ ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడతారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సమావేశం అనంతరం నెల్లూరు సంతపేటలోని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుని సాయంత్రం 6 గంటలకు తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొని మహర్షి మహేష్ యోజీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి రాత్రి 9 గంటలకు తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కు చేరుకుని హైదరాబాద్ కు వెళతారు.

వేసవిలో పశువులకు దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మించండి : కలెక్టర్ ఓ.ఆనంద్

విశాలాంధ్ర- నెల్లూరు(కలెక్టరేట్) : వేసవిలో పశువులకు దాహార్తి తీర్చేందుకు ప్రతి గ్రామములో పశు సంవర్ధక శాఖ అధికారులతో కలసి నీటి తొట్టెలు ఎక్కడిక్కడ అవసరమా గుర్తించి ఏప్రిల్ మాసంలోగా నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ డి.సి.పల్లి పంచాయతీ, మర్రిపాడు మండలంలో నీటి తొట్టి నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. జిల్లాలోని 963 నీటి తొట్టెలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు 693 నీటి తొట్టెల పనులను రూ.222 కోట్లతో పరిపాలనామోదం పొందిందన్నారు. వర్షా కాలంలో నీటిని వడిసి పట్టేందుకు ప్రతి రైతు తన పొలంలో సేద్యపు కుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వచ్చే మూడు మాసాలలో పంట కుంటలు రూ.47.25 కోట్ల వ్యయంతో 7500 పంట కుంటల పనులను త్రవ్వించాలని లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాలో 272 చెరువులను రూ.23.90 కోట్ల వ్యయంతో పూడిక తీసి నీటి నిల్వల సామర్థ్యం పెంచి చెరువు కట్టలను బలోపేతం చేసి పునరుద్ధరణ చేయాలన్నారు. పంట వరవ కాలువలు పునరుద్ధరణ జిల్లాలో 8737 కి.మీల కాలువలను రూ. 81.25 కోట్ల వ్యయంతో పూడిక తీసి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాది కూలీలకు 60 లక్షలు పని దినాలు లక్ష్యంగా ఉపాది కూలీలకు రూ.307 వరకు వేతనం దక్కేలా పనులు చూపనున్నారు. 4 గంటలు పని చేస్తే కూలి గిట్టుబాటు అయ్యేలా బృందానికి కొలతలతో మార్కింగ్ ఇస్తారు. కూలీలకు వేసవి తాపం తగలకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. గత ఆర్థిక సంవత్సరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 99.57 లక్షల పనిదినములు కల్పించినట్లు వివరించారు. అందులో రూ.241.31 కోట్ల వేతనాల క్రింద ఖర్చు చేశారన్నారు. పంచాయితీ వారోత్సవాలలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మౌలిక సదుపాయాల కల్పనలో గ్రామీణ ప్రాంతాలలో 200.45 కి.మీ రూ.83.49 కోట్లతో పూర్తి చేసినట్లు తెలిపారు. బి.టి.రోడ్లు 10.45 కి.మీలు రూ.4.73 కోట్లతో పూర్తి చేశారు. డబ్ల్యుబిఎం రోడ్లు 0.6 కి. మీ రూ.8.00 లక్షలతో పూర్తి చేశారు..మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల రైతుల సుస్థిర ఆస్తుల కల్పనలో భాగంగా పశువులు, గొర్రెలు, కోళ్ళు పెంపకం షెడ్లు 1122 పనులు రూ.25.80 కోట్లతో పూర్తి చేశారు.పరిశుభ్రతలో భాగంగా ఇంకుడు గుంటలు 7011 పనులను రూ.4.21 కోట్లతో పూర్తి చేశారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ 2210 ఎకరాలను రూ.30.26 కోట్లతో ప్లాంటింగ్ చేశారమన్నారు. డి.సి.పల్లి పంచాయతీ, మర్రిపాడు మండలంలో నీటి తొట్టి నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు

ఇఫ్కో సెజ్ అభివృద్ధిపై మరోసారి ఎంపీ వేమిరెడ్డి భేటీ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు:జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.ఇఫ్కో కిసాన్ సెజ్ అభివృద్ధిపై మరోసారి ఇఫ్కో సీఈవో డా.ఉదయ్ శంకర్ అవస్థితో భేటీ అయ్యారు.ఈ మేరకు గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డినిఉదయ్ శంకర్ అవస్థి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయనతో వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించారు. కొడవలూరు మండల పరిధిలో ఉన్న ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు స్థాపించాలని ఇటీవల ఎంపీ వేమిరెడ్డి.. ఇఫ్కో సీఈవో, ఛైర్మన్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన విషయం విధితమే. అనంతరం మరోమారు సంస్థ సీఈవో డా.ఉదయ్ శంకర్ అవస్థితో గురువారం ప్రత్యేకంగా భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు.2770 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, పరిశ్రమలు వస్తే జిల్లాయువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందుతాయని ఆయన వివరించారు ఈ విషయంపైసానుకూలంగా స్పందించిన ఉదయ్ శంకర్ అవస్థితమ పరిధిలో పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తామని ఎంపీ వేమిరెడ్డికి హామీ ఇచ్చారు.ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటుకు తమ మద్దతు ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా డా.ఉదయ్ శంకర్ అవస్థి.ఎంపీ వేమిరెడ్డికి కీలక సూచన చేశారు.ఎంపీగామీపరిధిలో పారిశ్రామికవేత్తలను కిసాన్ సెజ్‌లో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని కోరారు. పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి, సెజ్‌లో కంపెనీలు ఏర్పాటు చేసేలా ఆహ్వానించాలని సూచించారు. ఎంపీ చొరవతో ఎవరైనా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కంపెనీల ఏర్పాటుకు ముందుకు వస్తే.. తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని వెల్లడించారు.

ఉద్దేశం మంచిదే ..! ఆచరణలో అస్తవ్యస్తం ..ఈ కేవైసీతో ఇక్కట్లు!!

విశాలాంధ్ర-కావలి : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు సన్నద్ధమైంది.అందులో భాగంగా రేషన్ కార్డుదారులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలంటే ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడటం తెలిసిందే. ముందుగా గత మార్చ్ నెలాఖరుతోనే ఈ కార్యక్రమం పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు. తాజాగా సవరించిన ఆదేశాలను చూస్తే ఈనెలకారు వరకు కూడా గడువు పెంపుదల చేశారు. అయినా సరే ఎంతమంది ఈ ప్రక్రియ పూర్తి చేస్తారనేది అంతుపట్టడం లేదు. అలా ఎందుకంటే పాత రేషన్ డీలర్లకు ఈ బాధ్యతను అప్పగించారు. గత నాలుగు సంవత్సరాల పైబడి రేషన్ డీలర్లను జనం మరిచిపోయారు. ఇళ్ల వద్దకే ఎండియు మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో పాత డీలర్ల వద్దకు ప్రస్తుత మండు ఎండల్లో వెళ్లడం అందరికీ ఇబ్బందిగానే ఉంది. తీరా చూస్తే అక్కడ రేషన్ డీలర్లు ఉద్దేశపూర్వకంగానే అందుబాటులో లేకుండా జనాన్ని పదే పదే తిప్పుకుంటున్నారు. కొందరు డీలర్లు ఇదే అదనుగా ఒక్కొక్క కార్డుదారు నుంచి నల 50 రూపాయలు వసూలు చేస్తున్నారు. తొలిగా మార్చి నెల చివరి వరకు అని ప్రకటించిన ఆ తర్వాత ఏప్రిల్ వరకు గడువు ఇవ్వడంలో విద్యార్థుల పరీక్షల విషయాన్ని ప్రాముఖ్యంగా తీసుకున్నారు. కార్డుపై ఉండే అందరూ సభ్యులు తప్పనిసరిగా ఈకేవేసి చేయించుకోవాల్సిందే. ఐదేళ్ల లోపు చిన్నారులకు సంబంధించి ఇప్పటివరకు తల్లిదండ్రుల ఆధార్లు ప్రామాణికంగా తీసుకున్న ఇకపై వారికి కూడా తప్పనిసరిగా ఆధార్ ఉండాల్సిందే అంటున్నారు.ఈ విషయమై పౌరసరఫరాల అధికారులు స్పందించి సమస్యను పరిష్కార దిశగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా పరిధిలో రేషన్ కార్డులు 7,22,257, కుటుంబ సభ్యులు 20,04,581, ఇప్పటివరకు ఈ కేవైసీ చేయించుకున్న వారి సంఖ్య 18,21,650,చౌక దుకాణదారుల సంఖ్య 1513, ఎండియూ వాహనాలు సంఖ్య 438 వున్నాయి.

సెల్ ఫోన్‌కి బానిసలవుతున్న యువత...?

ఎక్కడికి వెళ్లినా.. ఎం చేసినా ఓ చేయి స్మార్ట్ ఫోన్ పైనే..!

రోజంతా వీడియో గేమ్‌లతోనే కాలక్షేపం

కంటి చూపు మందగించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిక

తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహారించాలి

విశాలాంధ్ర-వలేటివారిపాలెం : నేటి తరం సాంకేతిక యుగంలో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు సెల్ ఫోన్ వలయంలో చిక్కుకు పోయారు.ఎక్కడికి వెళ్లినా ఏం చేసినా ఓ చేయి స్మార్ట్ ఫోన్ పైనే ఉంటుంది షేరింగ్, లైక్ కామెంట్ ఈ క్షణం ఇదే ప్రపంచంగా యువత, పెద్దలు గడిపేస్తున్నారు. డబ్బు లావాదేవీలతో సహా వినోదానికి, కాలక్షేపానికి ఇలా అన్ని అంశాలతో సెల్ ఫోన్ ముడిపడి పోయింది.ఇది ప్రస్తుతం మానవ జీవనశైలిలో సెల్‌ఫోన్ ఒక భాగంగా మనుషులందరినీ కట్టు బానిసలుగా మార్చుకుంది. ఉదయం నుంచి రాత్రి నిద్రపోయే వరకు తనపై ఆదారపడేలా సెల్ ఫోన్ మలుచుకుంది. యువతీ, యువకులు విద్యార్థులైతే అరచేతిలో స్మార్ట్ ఫోన్ల ను పెట్టుకొని ఉదయం నిద్ర లేసిన దగ్గర నుండి రాత్రి పాడుకొనే వరకు పగలంతా సెల్ ఫోన్ తోనే కాలక్షేపం చేస్తున్నారు. చిన్న పిల్లలు ఎక్కువగా రోజంతా వీడియో గేమ్ లతో గడిపేస్తున్నారు.గంటలకొద్దీ అర్థం పర్థం లేని చాటింగ్ చేస్తూ సమయాన్ని వృధా చేస్తూ సోషల్ మీడియా కు బానిసలైపోతున్నారు.యువత ప్రస్తుతపరిస్థితిల్లో ప్రత్యక్షంగా ఉన్న మిత్రులతో ఆదుకోవడం కంటే ఆన్ లైన్ లో ఉన్న మిత్రులతో ఎక్కువగా గడుపుతున్నారు.సెల్ ఫోన్లు వచ్చినతరువాత మానవ సంబంధాలు తక్కువై హాయ్.. హలో... బాయ్ పలకరింపులతోనే సరిపెడుతున్నారు. ప్రస్తుతపరిస్థితిల్లో ఫోనుకు బానిసలుగా మారి అతిగా ఫోన్ వాడడం, మాట్లాడడం వల్ల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.అలాగే కంటి చూపు మందగించడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా మందగిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే

సెల్‌ఫోన్‌ల వల్ల చిన్న పిల్లల్లో సృజనాత్మకత తగ్గిపోవచ్చునని రోజులో ఫోన్ ఎంతతక్కువ వాడితే అంత మంచిదని 8 ఏళ్ళ లోపు పిల్లలకు ఫోన్లు ఇవ్వకపోవడం బెటరని వైద్య నిపుణులు పలు సందర్భాలలో చూసిస్తూ ఉన్నారు.ప్రధానంగా పిల్లలు, యువత పై తల్లిదండ్రుల పర్యవేక్షణ కరువవడంతో యువత, పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారుతున్నారు.

రోజంతా వీడియో గేమ్‌లతోనే కాలక్షేపం

కొందరు సామాజిక మాధ్యమాలలో ముందుకెలుతుంటే మరి కొందరు వీడియో గేమ్స్ తో కాలం గడిపేస్తున్నారు వీడియో గేమ్ లో లైనమైతే పరిసరాలలో ఏం జరుగుతుందో కూడా తెలియనంతగా నిమగ్నమైపోతున్నారు. ప్రస్తుతం పబ్జి,ఫ్రీఫైర్, గన్ షూటింగ్ వంటి పలు రకాల మునిగి ఆత్మహత్యల వరకు వెళుతున్నారు. సెల్‌ఫోన్‌ల కారణంగా నెట్ వాడకం కూడా అధికమైంది. గతంలో నెట్ దొరకాలంటే నానా అవస్థలుపడేవారు. ప్రస్తుతం త్రీజీ, ఫోర్ జీ, ఫైవ్ జీ సేవలతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ

సెల్ ఫోన్‌కి బానిసలవుతున్న యువత...?

(మొదటి పేజీ తరువాయి)

డేటా ప్యాకేజీలు లభిస్తుండడం నెట్ వినియోగం భారీగా పెరిగి పోతుంది. యువత చాటింగ్ వీడియో కాలింగ్ కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.వాట్సాప్, పేస్ బుక్,ట్విట్టర్, ఇన్ స్ట్రా గ్రాం స్నాప్ చాట్ నుండి మరికొన్ని సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో అవి ఇవి అని తేడా లేకుండా యువత తమకు నచ్చినట్లు షేర్ చేసుకుంటూ సెల్ ఫోన్ లే లోకంగా కాలం వెల్లదీస్తున్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి

పిల్లలు, యువత నిత్యం ల్యాప్ టాప్ లు, ట్యాబ్ లు,ఐ పాడ్ లు, సెల్ ఫోన్ లతో గడుపుతున్నారు ఆ సమయంలో ఏదైనా ఇబ్బంది కలిగిస్తే కోపంతో ఊగిపోతున్నారు. చదువును సైతం నిర్లక్ష్యం చేస్తూ చాటింగ్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. కొంతమంది అయితే తల్లిదండ్రులను కూడా ఎదిరిస్తున్నారు. చాలా మంది విజ్ఞానం కోసం వినియోగించకుండా కొత్త పరిచయాలు, కొత్త స్నేహం కోసం సోషల్ మాధ్యమాల్లో వెతుకుతున్నారు. అలాంటి వారి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, వారి పట్ల ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని లేకుంటే మనకు తెలియకుండా పిల్లలు అనారోగ్యాల పాలవుతారని మానసిక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సమన్‌కు మన్నేటి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఉదయగిరి : స్థానిక పట్టణంలోని నాగులు బావి వీధికి చెందిన ఎస్.కె సమన్ అనే బాలిక తల్లిదండ్రులను కోల్పోయి అనాథ స్థితి ఉందని గమనించిన పట్టణానికి చెందిన షకీరా అనే మహిళ ఆ బాలికను చేరదీసి అన్ని తానై కన్న బిడ్డల సంరక్షిస్తూ చూసుకుంటున్న నేపథ్యంలో ఆ బాలికకు చదువుకు ఆటంకం ఏర్పడడంతో తను చదువును కొనసాగించేందుకు మన ఫౌండేషన్ అధినేత రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డిని కోరారు స్పందించిన మన్నేటి సమన్ ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువును కొనసాగించేందుకు తక్షణ సాయం కింద పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు సదరు విద్యార్థికి షుగర్ కిడ్నీ వ్యాధి ఉందన్న విషయం తెలుసుకొని ఆమెకు ప్రభుత్వ పరమైన సాయం అందించేందుకు స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ సహకారం అవసరమని త్వరలో ఆయనను కలిసి విద్యార్థి విషయం తెలియజేస్తానని భవిష్యత్తులో ఏదైనా అవసరం అయితే సాయం అందించేందుకు ముందు ఉంటానని హామీ ఇచ్చారు బాగా చదువుకోవాలని కోరారు బాలిక సంరక్షకురాలు షకీరా బాలిక సమన్ మన్నేటి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు

ప్లాస్టిక్ కవర్లు అమ్మకంపై తనిఖీ

విశాలాంధ్ర-కావలి : ప్లాస్టిక్ కవర్లు అమ్మకంపై తనిఖీ చేసేందుకు స్థానిక ట్రంకు రోడ్డులోని ఏ బి సి ప్రొవిజన్స్ లోకి వెళ్ళగా షాప్ యజమాని కిరాణా మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాల్సా ప్రసాద్ మున్సిపాలిటీ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.షాప్ లోకి ఎలా వస్తారంటూ సానిటరీ ఇన్స్పెక్టర్ వ్యాపారస్తులకు సవాల్ చేస్తు అడ్డుకున్నా మాలాంటి చిన్న చిన్న వ్యాపారస్తుల వద్ద ఎన్ని సార్లు లంచం మీరు తీసుకోలేదా అంటూ మున్సిపాలిటీ సిబ్బందిని నిలదీశారు. ఎవరు లంచాలు తీసుకున్నారు శానిటరీ ఇన్స్పెక్టర్ వ్యాపారస్తులకు సవాల్ విసిరారు. దీంతో ఇద్దరి మధ్య కాసేపు అరుపులు కేకలు వేసుకుంటూ ఘర్షణ వాతావరణం నెలకొంది.తనిఖీకి వచ్చిన అధికారులపై కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బల్సా ప్రసాద్ వారి సభ్యులు దౌర్జన్యంగా అడ్డుకోవడం ఏంటని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్లాస్టిక్ కవర్లు అమ్మద్దు అంటూ మున్సిపాలిటీ అధికారులు గత రెండు నెలల నుంచి చెప్తున్నా అధికారులు మాటలు వినకుండా కొందరు వ్యాపారస్తులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. డ్యూటీ చేస్తున్న తమపై వ్యాపారస్తులు అడ్డుకోవడం ఏంటని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

బి.ఆర్ అంబేద్కర్ జయంతికి భారీ ఏర్పాట్లు

విశాలాంధ్ర -కందుకూరు రూరల్ : భారతరత్న, రాజ్యాంగ రూపకర్త, దళిత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, లౌకిక ప్రజాస్వామ్య భారత నిర్మాత, ప్రపంచ విజ్ఞానజ్యోతి, నిమ్న జాతుల సంఘసంస్కర్త, కుల నిర్మూలన సామాజిక విప్లవాది, బోధిసత్వ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణ నడిబొడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఏప్రిల్ 1నుండి 13వ తారీకు వరకు జరుగుతున్న నివాళులు అర్పించు కార్యక్రమం.ఏఏడి అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ,దమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలనుండి జరుగుతున్నాయి. అందులో భాగంగా మూడవ రోజు స్కందపురి పెయింటర్స్ వర్కర్స్ యూనియన్ వారు ఉదయం 7:30 గంటలకు నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో స్కందపురి పెయింటర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు జమ్మలమడుగు రవి, కంకణాల బ్రహ్మయ్య, పి. మాల కొండయ్య చనమాల బాలు, సి హెచ్.ప్రవీణ్, సి హెచ్.ప్రసన్న, ఎమ్ యోహాన్, ఎమ్. రాంబాబు, డి.నాగరాజు, గేరా శివ, గేరా నరేష్, . శ్రీను, ఎన్ .క్రాంతి, రోజాబాబు, రాము, సి హెచ్. చిన బ్రహ్మయ్య సామాజికవేత్త గేరా చిరంజీవి ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షులు షేక్. మహబూబ్ బాషా న్యాయవాదులు ముప్ప వరపు.కిషోర్,లింగా బత్తిన బ్రహ్మయ్య ,ఉపాసక గాండ్ల. హరిప్రసాద్, ఎ. ఎ. డి ఉపాధ్యక్షులు చనమాల. కోటేశ్వరరావు, కళాకారులు పొనుగోటి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్ కళాశాల ఆచార్యునికి అరసం సత్కారం



విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: వి ఆర్ కళాశాల పొలిటిక్స్ విభాగం విశ్రాంత ఆచార్యులు కాంజీవరం రాధాకృష్ణ తాజాగా వెలువరించిన అభ్యుదయ కవితా సంపుటి "మారకనే మారానంటాడు" నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ, అరసం జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ వెంకటప్పయ్య రమేష్ రెడ్డి నగర్ లోని వారి స్వగృహం కెల్లి కవితో ఇష్టా గోష్టిగా అనేక కవితా విషయాలు చర్చించారు.ముప్పై ఏళ్లుగా సమాజంలో జరుగుతున్న అంశాలపై రాసిన కవితలు పుస్తకం వేశానని అన్నారు కవి రాధాకృష్ణ.ఎందరో జ్ఞాన సంపన్నులు మానవ నైజాన్ని వడబోసి ప్రపంచానికి అందించిన మానవీయ విలువలను పేడ చెవిన పెట్టి మారకనే మారానంటాడు మనిషి అనేది తన కవితల సారాంశం అన్నారు. కొన్ని కవితలు స్వీయ పఠనం చేశారు కవి.అనంతరం తొలి కవితా పుస్తకం వెలువరించిన రాధాకృష్ణను అరసం నెల్లూరు శాఖ తరఫున సత్కరించారు. ఈకార్యక్రమంలో డా పెరుగు రామకృష్ణ ,డాక్టర్ టేకుమళ్ళ వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయిలో అవార్డులు సాధించిన నెల్లూరు ఇతాక స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: ఇథక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందడం చాలా అదృష్టంగా భావిస్తున్నామని ప్రిన్సిపల్ శోభన లక్ష్మీనారాయణ, అకడ మీక్ డైరెక్టర్ రాణి,జిఎం జీవన్ లు తెలిపారు నెల్లూరులోని ఇతాక ఇంటర్నేషనల్ స్కూల్లో లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వరుసగా మూడు సంవత్సరాల నుంచి ఇతర ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిష్టాత్మకంగా నేషనల్ స్పేస్ సొసైటీ వారు నిర్వహిస్తున్నటువంటి కాంటెస్ట్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారని తెలిపారు ప్రపంచమే 30 దేశాలు ఈ ఈ పోటీలలో 29 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా పదవ తరగతి విద్యార్థుల విభాగంలో మహిక్షిత్ రెడ్డి, ప్రపంచ స్థాయిలో రెండవ స్థానాన్ని 8వ తరగతి విభాగంలో మొహమ్మద్ అమాస్ ప్రపంచ స్థాయిలో మూడవ స్థానాన్ని సంపాదించుకోవడంతో భారతదేశ చరిత్రలో ఇటాక ఇంటర్నేషనల్ స్కూల్ పథకాన్ని ప్రపంచ స్థాయికి ఎగురవేశారన్నారు.

గిరిజన మహిళల అభివృద్ధికి కేంద్రం సాయం ఏంటి?-ఎంపీ వేమిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ లో గిరిజన మహిళల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏంటని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన లోక్‌సభలో ఈ విషయమై పలు ప్రశ్నలు వేశారు. జాతీయ గిరిజన ఆర్థిక, అభివృద్ధి సంస్థ ద్వారా ఆదివాసీల ఆదాయం, స్వయం ఉపాధి కోసం అమలు చేస్తున్న పథకాల వివరాలు ఆరా తీశారు. ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన గిరిజన మహిళలకు ఏ మేరకు సహాయం చేస్తోందని, గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన మహిళలకు ఇచ్చిన రుణాల వివరాలు తెలియజేయాలన్నారు. వీరికి ఇస్తున్న రుణాన్ని10 లక్షలకు పెంచే ఆలోచన ఏదైనా ఉందా అని వివరాలు కోరారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వివిధ పథకాల కింద ఆదాయ ఉత్పత్తి కార్యకలాపాలు/స్వయం ఉపాధిని చేపట్టేందుకు అర్హులైన షెడ్యూల్డ్ తెగలకు రాయితీ రుణాలను అందిస్తుందన్నారు. అందులో ముఖ్యంగా టర్మ్ లోన్ స్కీమ్ అనే పథకం కింద ఎన్ఎస్‌టిఎఫ్‌డీసీ ప్రాజెక్టుకు రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించబడుతుందని, ఇందులో ప్రాజెక్ట్ వ్యయంలో 90% వరకు ఆర్థిక సహాయంగా అందించబడుతుందన్నారు. మిగిలిన మొత్తాన్ని సబ్సిడీ/ప్రమోటర్ సహకారం ద్వారా సమకూర్చడబుతుందన్నారు. ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన షెడ్యూల్డ్ తెగల మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేకమైన పథకం. ఈ పథకం కింద రూ. 2 లక్షల ప్రాజెక్ట్ వ్యయంలో 90% వరకు రుణంగా అందించబడుతుందన్నారు.మైక్రో క్రెడిట్ పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా ఎస్టీ సభ్యులకు రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. ఇందులో ప్రతి సభ్యునికి 50000 వరకు, స్వయం సహాయక బృందానికి గరిష్టంగా 5లక్షల వరకు రుణాలు అందజేస్తుందన్నారు.ఆదివాసీ శిక్షాగ్రిన్ యోజన అనే పథకం ఎస్టీ విద్యార్థులకోసం ఉద్దేశించబడిందన్నారు. దీని కింద సాంకేతిక, వృత్తిపరమైన విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థికి 10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించబడుతుందన్నారు.ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన పథకం కింద, ఎన్ఎస్‌టిఎఫ్‌డీసీ గత ఐదు సంవత్సరాలు, ప్రస్తుత సంవత్సరంలో (28.03.2025 వరకు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని సమాధానం ఇచ్చారు. అయితే, స్త్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా ఎస్‌హెచ్‌జీ సభ్యుల కోసం మైక్రో క్రెడిట్ స్కీమ్ కింద మహిళలకు సహాయం చేయబడిందన్నారు. ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన కింద రుణ పరిమితిని పెంచడంపై ఎలాంటి ఆలోచన లేదన్నారు.

ప్రకాశం విద్యార్థుల్లో స్ఫూర్తి జ్వాలలు నిప్పిన ప్రదీప్ పవర్ స్పీచ్

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రేరణ కలిగించేందుకు "అన్లీషింగ్ ది బెస్ట్ ఇన్ యూ" పేరుతో మోటివేషనల్ స్పీకర్లు కేవీ ప్రదీప్, జేసీ సరస్వతి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, 20 పాయింట్ల కమిటీ చైర్మన్ లంకా దినకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రేరణాత్మక వక్త ప్రదీప్ ప్రసంగం విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని రగిలించి, వారిలో కొత్త ఆలోచనలకు నాంది పలికిందని ఎమ్మెల్సీ, కుప్పం ఇన్చార్జి, ప్రభుత్వ విప్ డా. కంచర్ల శ్రీకాంత్ ప్రశంసించారు.విద్యార్థుల భవితకు దిక్సూచిగా నిలిచే ఇలాంటి కార్యక్రమాలు అత్యంత ఆవశ్యకమని లంకా దినకర్ ఉద్ఘాటించారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కళాశాల ప్రతినిధి డా. కంచర్ల రామయ్య, సాంకేతిక సంచాలకుడు డా. కంచర్ల విజయ్ శ్రీనివాస్‌లను ఆయన హృదయపూర్వకంగా అభినందించారు. ప్రదీప్ దంపతుల ప్రసంగం విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా దిశానిర్దేశం చేసింది. వారి స్ఫూర్తిదాయకమైన కథనాలు, జీవితానుభవాలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపాయి. ఈ ప్రసంగం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుంది అని కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ తెలిపారు.కార్యక్రమం ముగింపులో లంకా దినకర్, ప్రదీప్ దంపతులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారపక్షానికి కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

- భీమవరప్పాడు వైస్ ప్రెసిడెంట్ మాల్యాద్రి డిమాండ్

విశాలాంధ్ర - కొండాపురం : భీమవరప్పాడు గ్రామపంచాయతీ పరిధిలోని 151, 166, 167, 168 సర్వే నెంబర్ల లోని పట్టా పొలాలలో సాగుచేసిన వరి, జామాయిల్ రైతులను రెవిన్యూ, పోలీస్ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరికాదని భీమవరప్పాడు గ్రామ వైస్ ప్రెసిడెంట్ విడవలపాటి మల్యాద్రి పేర్కొన్నారు. ఆయన గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ మాజీ సర్పంచి చాగంటి కృష్ణ, పేరయ్య, గొట్టిపాటి వెంకటేశ్వర్లు , కొప్పోలు వెంకట్రావు మరి కొంతమంది అధికార కూటమి పార్టీకి చెందిన వ్యక్తులు ప్రమేయంతో మండల తాహసీల్దారు, 144వ సెక్షన్ అమలుచేసి వరి కోతను అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ ఉత్తర్వులపై తాను హైకోర్టును ఆశ్రయించి స్టే పొందడం జరిగిందన్నారు. స్టే కాపీని తహసిల్దారు, ఎస్సైకి అందజేసి వరి కోసుకోవడం జరిగిందన్నారు. ఈ సర్వే నెంబర్లలోని రైతుల పేర్లను మండల రికార్డులలో తెలుగుదేశం పార్టీ నాయకులు పలుమార్లు తొలగించడం జరిగిందన్నారు. రైతులు కోర్టు, కలెక్టర్ ద్వారా తిరిగి ఆన్లైన్ లో వన్ బి లో పేర్లు ఎక్కించుకోవడం జరిగిందన్నారు. ఈ భూమిని రామయ్య అనే వ్యక్తికి జిపి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై చాగంటి కృష్ణ ఆధ్వర్యంలో మద్దినేని హనుమంతరావు, మరికొందరు కావలి కోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. పిటిషన్ మీద ఎటువంటి ఉత్తర్వులు లేవన్నారు. 129 మందికి సమన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ భూములకు సంబంధించి మరికొంత మొత్తం పెండింగ్ ఉండడంతో వాటిని మేము రిజిస్టర్ చేయకుండా మేమే సాగు చేసుకుంటున్నాం అన్నారు. గత మూడు రోజులుగా ఈ సర్వే నెంబర్లలో సాగులో ఉన్న రూ.8 లక్షల ఖరీదు చేసే జామాయిల్ చెట్లను అధికార పక్షం నాయకులు కొట్టి తోలడం జరిగిందన్నారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై తాసిల్దార్ కోటేశ్వరరావును వివరణ అడగా తాను రికార్డులు పరిశీలించి ఎవరి దగ్గర రికార్డులు ఉన్నాయో వారికి న్యాయం చేస్తానన్నారు.

నాలుగు వాహనాలకు 50 వేలు జరిమానా :ఆత్మకూరు ఆర్టీవో రాముడు

విశాలాంధ్ర-కలువాయి : కలువాయి బస్టాండ్ సెంటర్ నందు సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలకు రూ.50 వేలు జరిమానా విధించినట్లు ఆత్మకూర్ ఆర్టీవో రాముడు తెలిపారు. వాహనదారులందరూ తప్పక నియమాలను పాటించాలని ద్విచక్ర వాహన దారులు లైసెన్స్, హెల్మెట్ ధరించి ప్రయాణం చెయ్యాలని తెలిపారు, పట్టుకున్న వాహనా లను కలువాయి పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు, తెలిపారు.

నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

విశాలాంధ్ర- గుడ్లూరు :మండలంలోని తెట్టు గ్రామంలో టీడీపీ నాయకుడు షేక్ సుల్తాన్ భాష నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వర రావుపాల్గొన్నారు.ఈ సందర్భంగా సుల్తాన్ భాషా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే స్వాగతం పలికారు.ముందుగా తెట్టు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సయ్యద్ సుల్తాన్ బీబీ అమ్మవారి దర్గాలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పంచాయతీ తాళాలు పగలగొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోండి : డిపిఓ శ్రీధర్ రెడ్డి

విశాలాంధ్ర-ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నందు జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 పంచాయతీల కార్యదర్శులకు పలు విషయాలపై సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం పాత్రికేయులు అడిగిన పలు సమాధానాలు ప్రశ్నలకు సమాధానం చెబుతూ చాకిచెర్ల పంచాయతీ ప్రధాన ద్వారం తాళాలను కొందరు ఉద్దేశపూర్వకంగా పగలగొట్టారు. ఆ విషయం తన దృష్టికి రాకపోవడంతో అధికారులను ప్రశ్నించి అలా ప్రభుత్వ కార్యాలయాల తాళాలు పగలగొట్టిన వ్యక్తులపై ఎందుకు పోలీస్ కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. అనంతరం సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసి ఆ నోటీసు నకలను తమకు పంపించవలసిందిగా ఆదేశించారు అనంతరం వారు రాసిన సమాధానాలను బట్టి తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ విషయం పై స్థానిక ఈఓఆర్డి, ఎంపిడిఓలు చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.అనంతరం ఉలవపాడు లోని వేణుగోపాల స్వామి ఆలయం ముందు బజారు పర్యటించి సూచనలు సలహాలు చేశారు.

ఆర్టీసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి-ఎన్ఎంయుఏ

విశాలాంధ్ర-రాపూరు:రాపూరుఆర్టీసి డిపోలో ఎన్ఎంయుఏ ఉద్యోగులు ఈనెల రెండు,మూడు తేదీలలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎర్ర బ్యాడ్జిలతో విధులను నిర్వహించారు. అపరిష్కృంగా వున్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ ఎండి కి మెమోరాండం అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని నిరసన తెలియజేశారు.

శ్రీ షిరిడి సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు పూజలు

విశాలాంధ్ర-మనుబోలు:మనుబోలు గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద సమర్పణ కార్యక్రమం చేశారు. అర్చకులు శ్రీనివాసులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలకు ఉభయ దాతలుగా పిడూరు గ్రామం మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్ రెడ్డి, వీరి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ పూజలలో అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధి కూలీల కనీస వేతనం రూ.307 :బోలా శీను

విశాలాంధ్ర -మనుబోలు: 2024-25లో కంటే అదనంగా రూ.7 పెంచిన కేంద్రం. ఏప్రిల్ 1నుంచి అమలవుతుందని జిల్లా బిజెపి నేత బోలా శీను తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులకు హాజరయ్యే కూలీలకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో కనీస వేతనం రూ.307గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024-25 సంవత్సరం కంటే రూ.7 అదనంగా పెంచిందన్నారు. రాష్ట్రంలో ఏప్రిల్ 1 నుంచి పెంచిన కొత్త వేతనం అమల్లోకి వస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ వెల్లడించింది. కూలీలకు కేంద్రం ఏటా కనీస వేతనం రాష్ట్రాల వారీగా ప్రకటిస్తుంది.

సాయినాధుని సన్నిధిలో దారపనేని

విశాలాంధ్ర-వరికుంటపాడు : కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ వరికుంటపాడు గ్రామంలో వెలసివున్న శ్రీ సాయిబాబా దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ విశ్వా వసు నామ సంవత్సరం చైత్రమాసం షష్టి గురువారం సందర్భాన్ని పురస్కరించుకొని సాయిబాబాను దారపనేని దర్శించుకున్నారు. గురువారం బాబా దర్శనంతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తులకు అపారమైన నమ్మకం అన్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు, బాబా తీర్థ ప్రసాదాలు దారపనేనికి అందజేశారు.

రి సర్వే పై గ్రామసభ

విశాలాంధ్ర-కలువాయి : కలువాయి మండలంలోని నూకనపల్లి గ్రామంలో గురువారం భూ రి సర్వేపై గ్రామంలో ర్యాలీ గ్రామసభ నిర్వహించారు, ఈ సందర్భంగా తాసిల్దార్ శ్యాంసుందర్ రాజు మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రిసర్వేని గ్రామ రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో రి సర్వే డిటి, మంజుల, సర్వేయర్లు హదరత్తయ్య, నవీన్ ,వీఆర్వోలు లక్ష్మీ, అరుణ, గ్రామప్రజలు పాల్గొన్నారు.

బాశం దినేష్ దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి

విశాలాంధ్ర-వలేటివారిపాలెం : మండలంలోని శింగమనేనిపల్లే గ్రామానికి చెందిన బాశం దినేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.గురువారం దినేష్ ఇంటి వద్ద జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరై దినేష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ చైర్మన్ చెన్ను వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-రాపూరు: దివంగత నేత, రాపూరు మాజీ మండల అధ్యక్షులు, మాజీ మార్కెటింగ్ చైర్మెన్ చెన్ను బాలకృష్ణ రెడ్డి వర్ధంతి కార్య క్రమం స్థానిక చెన్ను గార్డెన్స్‌లో గురువారం నిర్వహించారు.కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తలు, అభిమానులు చెన్నుతో ఉన్న అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మండల నలుమూలాల కార్యకర్తలు, అభిమానులకు సుమారు 2000 మందికి భోజన కార్యక్రమాన్ని చెన్ను కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పెంచలకోన మాజీ చైర్మెన్ చెన్ను తిరుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. చెన్ను బాలకృష్ణా రెడ్డి మండలంలోని చాలా మందికి ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు చేయందించారాని పలువురు అభి ప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, కార్యకర్తలు, చెన్ను అభిమానులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక విస్తృత కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర-కావలి: పట్టణంలోని రవి నర్సింగ్ హోంలో కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు అధ్యక్షతన విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ. రవికుమార్, అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కావలి పట్టణములో విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచులను వాడుతున్నారన్నారు. అందుకని (శనివారము) నాడు బాబు జగజ్జీవన్ జయంతి సందర్భంగా కావలి పట్టణంలోని రైతు బజార్ సెంటర్‌లో ప్రజలకు 'పర్యావరణ పరిరక్షణ అవగాహన నిమిత్తమై' గుడ్డ సంచులను పంపిణీ చేస్తామన్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం లాగానే "ర్యాంకర్స్ డే" ని జరుపుటకు 'ప్లాన్ అఫ్ యాక్షన్' (భవిష్యత్ కార్యాచరణ)ను కార్యవర్గ సమావేశంలో చర్చించి తీర్మానించడం జరిగిందని తెలిపారు. జె వి వి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే వారికి మా మద్దతు ఎల్లవేళలా ఉంటుందని, అదేవిధంగా ప్రజలు శాస్త్రీయ ఆలోచన దృక్పథంతో మెలుగుతూ, మూఢనమ్మకాలను పారద్రోలి, ఈ సమాజము అభివృద్ధి వైపు పయనించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ. రవికుమార్, అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరెడ్డి. హరనాథ్, కోశాధికారి టి. సుబ్బరామశర్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు కె. హరి నారపరెడ్డి, సి. కల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జి. కళ్యాణి, మాధవ, సహాయ కార్యదర్శులు గాదిరెడ్డి. మురళీకృష్ణ, గుణకల. శివయ్య, కార్యవర్గ సభ్యులు ఎం.వి.ఎన్. ప్రసాద్, కె. జాన్, పి వి న్ సుధాకర్ రావు, రఫి, బి. మాధవ రావు, వై. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పక జరిపించండి :జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విజయ్ కుమార్

విశాలాంధ్ర -నెల్లూరు (కలెక్టరేట్) : జిల్లాలో 2 లక్షల కార్డులకు ఇంకా ఈ కేవైసీ జరిపించాల్సి ఉందని ఆ కార్డులకు తప్పక ఈకేవైసీ జరిపించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటో తేదీన తను బాధ్యతలు చేపట్టానన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రముఖ పాత్ర వహించే రేషన్ కార్డులు ఈ జిల్లాలో దాదాపు 20 లక్షలు ఉన్నాయన్నారు రెండు లక్షల కార్డులు మినహా మిగిలిన రేషన్ కార్డులు అన్నిటిలో ఈ కేవైసీ పూర్తయిందన్నారు. ఈ రెండు లక్షల కార్డులలో ఇంకా ఈ కేవైసీ జరగలేదన్నారు. రెండు లక్షల కార్డులకు సంబంధించి రేషన్ రేషన్ షాపు వారిగా విభజించి వారికి ఈకేవైసీ చేయాల్సిన వారి పేర్లను పంపి సూచనలు చేయడం జరిగిందన్నారు. తదుపరి వీటికి సంబంధించి మండల తాసిల్దారులు మా పంపిణీ డిప్యూటీ తాసిల్దారు ద్వారా ఒక సమావేశం ఏర్పాటు చేసి డీలర్లకు సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఈ రెండు లక్షల కార్డులలో ఉన్న పేర్లకు ఈ కేవైసీ జరిపించుకోవాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు విస్తృత చర్యలు : ఎస్ఐ జానకి రామయ్య

విశాలాంధ్ర-కావలి : పట్టణ పరిధి లోని ట్రంకు రోడ్డుతో సహా ఇరు వైపులా రద్దీగా ఉండే పలు వ్యాపార దుకాణాల సందుల్లో ట్రాఫిక్ క్రమబద్దీకరణం నిమిత్తం విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఒకటో పట్టణ ఎస్సై జానకి రామయ్య తెలిపారు. గురువారం ట్రంకు రోడ్లో ఇరువైపులా ఉన్న దుకాణదారులతో, తోపుడు బండ్లు ఇతర చిరు వ్యాపారులతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికే పురపాలక పరిధిలో ట్రంకు రోడ్డుకు సంబంధించి రెండు పక్కల ఎనిమిది అడుగుల దూరం పార్కింగ్ నిమిత్తం కేటాయించిన సంగతిని వ్యాపారులకు గుర్తు చేశారు. ఆ ఎనిమిది అడుగుల దూరంలో ఎవరు ముందుకు వచ్చి వ్యాపార కార్యక్రమాలు నిర్వహించడం తగదన్నారు. ట్రాఫిక్ అంతరాయం సృష్టిస్తే తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జరిమానాలు సైతం కఠినంగానే ఉంటాయని వెల్లడించారు. తాము చర్యలు తీసుకుంటుంటే కొందరు రాజకీయ సిఫార్సులు చేయిస్తున్నారని వాటిని సైతం లెక్కచేయక కఠినంగానే వ్యవహరించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్య కొలిక్కి వచ్చేవరకు ప్రతిరోజు రద్దీ వేళలతో పాటు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరిగి సాయంత్రము నుంచి రాత్రి పొద్దుపోయే వరకు తమ సిబ్బంది గస్తీ చర్యలు తీసుకుంటారని వివరించారు. చిరు వ్యాపారాలు ఎట్టి పరిస్థితుల్లోనూ 8 అడుగుల నిడివిని ఆక్రమించకుండా మాత్రమే వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచనలు చేశారు. వాహనదారులు సైతం ఎక్కడపడితే అక్కడ అడ్డగోలుగా పార్కింగ్ చేయడం తగదన్నారు. అలా పార్కింగ్ చేసిన వాహనాలను తాము స్టేషన్కు తరలించడంతోపాటు విధించేందుకు సైతం వెనుకాడబోమని పేర్కొన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విది నిర్వహణలో ఎస్సై జానకి రామ తో పాటుపాటు ఎస్సైలు సుమన్ జమాల్ వలి కూడా పాల్గొన్నారు.

రీ సర్వే పై అవగాహనా ర్యాలీ

విశాలాంధ్ర -మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రీ సర్వే పై మనుబోలు మండలం మడమనూరు గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ సిహెచ్ సుబ్బయ్య మాట్లాడుతూ రీ సర్వే చేసేటప్పుడు రైతులు తమ పాస్ పుస్తకాలను తీసుకొని వచ్చి చూపి సహకరించాలని కోరారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా ఈ సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలకు అవగాహన కొరకు ర్యాలీ నిర్వహించారు. ఐఓఎస్ ఇన్స్పెక్టర్ రఘురామరాజు, మండల సర్వేయర్ శ్రీనివాసులు, శ్రీరాములు వీఆర్వోలు: నాగార్జునరెడ్డి, నాగేంద్ర,మురళి, శ్రీనివాసులు సచివాలయ సర్వేలు వంశీ, శివ, నాగేంద్ర, నాయకులు లక్ష్మయ్య, రైతులు తదితరలు పాల్గొన్నారు.

అనుమతుల మేరకు వాణిజ్య, గృహ నిర్మాణాలు చేపట్టాలి :ఎమ్మెల్యే ఇంటూరి

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జగన్మోహన్ రెడ్డి రామాయపట్నం పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.26 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పి అరకొర నిధులిచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఫిబ్రవరి 15 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా కందుకూరు పట్టణానికి విచ్చేసినప్పుడు మున్సిపాలిటీకి రూ.50 కోట్ల నిధులు కేటాయించారన్నారు. పట్టణాభివృద్ధికి ముందుగా రూ.26 కోట్లనిధులకు ప్రణాళికలు అంచనాలు తయారు చేయాలన్నారు. 25 కిలోమీటర్ల మేర రోడ్లు 14 కిలోమీటర్ల మేర డ్రైన్‌లకు నిధులు అవసరమవుతాయని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నుడా విసి సూర్యతేజ, మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో చర్చించామన్నారు. పట్టణ ప్రజలు అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాలు, గృహాల యజమానులు మున్సిపాలిటీ నిబంధనల మేరకే నిర్మాణాలు చేయాలని అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎవరైనా మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి తన పేరు కానీ, పార్టీ పేరు కానీ వాడుకొని వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.అమృత్ 2.0 పథకంకు కందుకూరు మున్సిపాలిటీ ఎంపికైందని, త్వరలో రూ.49 కోట్ల నిధులు కేటాయించబడతాయన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన ఎం.ఆర్.ఎఫ్ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్‌లో అత్యధిక టెక్నాలజీ ద్వారా రోజుకు 30 టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసే మిషన్‌ను త్వరలో ఏర్పాటు చేసి ఏ రోజు చెత్తను ఆరోజు ప్రాసెసింగ్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్ సలాం పాల్గొన్నారు.

బిఆర్ఆక్స్ ఫర్డ్ స్కూల్‌లో 11వ వార్షిక వేడుకలు



విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు పట్టణంలోని బి ఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్‌లి 11వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి పామూరు రోడ్‌లో ఆక్స్ ఫర్డ్ స్కూల్ క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించారు. క్రీడా మైదానం అంతా ఫ్లడ్ లైట్ల వెలుగుల కాంతులతో నిండి పోయి అంగరంగ వైభవంగా విద్యార్థులు, తల్లిదండ్రులు సుమారు 5 వేల మందికి పైగా హాజరైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ప్రముఖ సినీ నటులు, మోటివేటర్ కే వి ప్రదీప్ గారు, జే సి సరస్వతిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు విద్యార్థులకు,తల్లిదండ్రులకి, ఉపాధ్యాయులకు విలువైన సూచనలు,సలహాలు చక్కగా తెలియజేశారు. విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు , కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి. బాల భాస్కరరావు,బి. నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్,డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్,ఇంటర్ కాలేజ్ ప్రిన్సిపాల్స్, కనిగిరి స్కూల్,కాలేజ్ లకు సంబంధిత డైరెక్టర్, ప్రిన్సిపాల్,విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ యాజమాన్యం వారు భోజనం ఏర్పాటు చేశారు.

మాకు న్యాయం చేయండి.. కాకుమాని కోటేశ్వరరావు

విశాలాంధ్ర- కందుకూరు రూరల్ : మా పొలం మాకు వస్తే బెదిరించడం న్యాయం కాదని, ఒక ఉపాధ్యాయ వృత్తిలో ఉండి బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదు అని కాకుమాని కోటేశ్వరరావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాకుమాని కోటేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు మండలం మహాదేవపురం పంచాయతీ కాకుమాని వారి పాలెం గ్రామంలో సర్వేనెంబర్ 664/1లో ఒక ఎకరా 19 సెంట్లు భూమి కలదు అని, అందులో మా పక్క పొలం యజమాని అయిన దివి కోటేశ్వరరావు మా పొలంలో కొంత భాగాన్ని ఆక్రమించి దాదాపు 20 సంవత్సరాల నుండి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మా పొలంతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ కుంటను ఆక్రమించి పశువులకు నీళ్లు లేకుండా చేశారని దానిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో అర్థం కాని ప్రశ్నల మిగిలిందని ఆయన ఆరోపించారు. ఇదేమిటని ప్రశ్నించినప్పుడల్లా మాపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేను ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిని అని నాకు అధికారులు అందరూ తెలుసని మీరు ఎవరి దగ్గరికి వెళ్ళినా నన్నేం చేయలేరు అని అంటూ నన్ను నా కుటుంబాన్ని ఇబ్బందులు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేము మా పొలం కొరకు న్యాయపోరాటం చేయడంతో సంబంధిత అధికారులు గత రెండు రోజుల క్రితం వచ్చి మా పొలంకి ఉన్న హద్దులను కొలిచి మా స్థలంలో హద్దులు వేసి వెళ్లారని అప్పటినుండి దివి కోటేశ్వరరావు రాళ్లు వేసినంత మాత్రాన మీరేం చేయగలరు అంటూ మా పొలం మాకు అప్పచెప్పకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అతను ప్రభుత్వ ఉద్యోగి అయినందున నేను మీడియాను ఆశ్రయించడం జరిగిందని మీడియా వారు నాకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు.

ఏఎల్‌సిసి సినిమాను ఆదరించండి

విశాలాంధ్ర-నెల్లూరు (కలెక్టరేట్) :ఏ ఎల్ సి సి సినిమాలో ఆదరించండి అని ఆ సంస్థ నిర్వాహకులు కుమారస్వామి చంద్రారెడ్డిలో తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆసక్తిరమైన కథనంతో ఏప్రిల్ 25వ తేదీన రిలీజ్‌కి సిద్ధమౌతోన్న "ఏఎల్‌సిసి" సినిమానుయెల్ ఆర్ ఫిల్మ్ సర్క్యూట్స్ సంస్థ లేలీధర్ రావు కోలా స్వీయ దర్శకత్వంలో చలన చిత్రం ఈ చలనచిత్రాన్ని నిర్మించారన్నారు-ఏ ఎల్ సీ సీ" (ఓ యూనివర్సల్ బ్యాచిలర్). ఈ సినిమా ద్వారా జే పీ నవీన్ ని హీరో గా, శ్రావణి శెట్టిని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నామన్నారు. ఈ సినిమా, తిరుపతి, తలకోన, తూపిలిపాలెం, రామోజీ ఫిల్మ్‌సిటి తదితర ప్రాంతాలలో చిత్రీకరించామన్నారు.జులై 2024లో మొదలైన ఈ సినిమా షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ముగించుకొని రిలీజ్‌కి సిద్ధమౌతోంది. ఈ సినిమాలో మొత్తం నాలుగు పాటలు ఉంటాయి. అన్ని పాటలు మ్యాంగో మ్యూజిక్ లేబల్ ద్వారా విడుదల అయ్యి అందరి ప్రశంశలు పొందుతున్నాయి."ఏ ఎల్ సీ సీ" సినిమా గ్లోబల్ గా ప్రతి ఒక్క మగవాని జీవితంలో, బ్యాచిలర్‌గా ఉన్నపుడు జరిగే సంఘటనల ఆధారంగా రూపొందించబడింది.ప్రతి ఒక్క అబ్బాయి, ఏదో ఒక సన్నివేశంలో తమను తాము చూసుకునేలా ఈ సినిమా ఉంటుంది. తను బిడ్డలు తమ గురించి ఎలా ఆలోచిస్తారో ఈ సినిమా ద్వారా ప్రతి ఒక్క తల్లి తండ్రి తెలుసుకోవచ్చు. అలాగే అమ్మాయిలు, అబ్బాయిల మనస్తత్వం గురించి, వారి ఆలోచనల గురించి ఈ సినిమా ద్వారా తెలుసుకోవచ్చు.వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తప్పక చూడవలసిన సినిమా.. ఏ ఎల్ సీ సీ.అని తెలిపారు ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ యూత్ లో క్యూరియాసిటీని పెంచింది.అని అన్నారు టైటిల్ ప్రక్కన ఉన్న "యాంటీ లేడీ కమిటీ చైర్మన్" స్టాంప్ ఆసక్తికరంగా ఉండటంతో కథ ఏ విధంగా ఉండబోతోం దన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. అని తెలిపారు. ఇతర చిత్ర తారగణం: దనుష్ దేవర పోలి, శ్రీకర్ కొమాండూరి, శామ్ నాయక్, నేత్ర, రాజీవ్ కోలార్, ఇ. రామేశ్వరం, డి శ్రీనివాసులు రెడ్డి, కమల్, హరినాధ రాజు, తదితరులు. ఈ చిత్రానికి కథ, మాటలు, చిత్రానువాదం, నిర్మాత, దర్శకత్వం: లేలీధర్ రావు కోలా, సంగీతం: జస్వంత్ పి, సినిమాటోగ్రఫీ: యెస్ చరణ్ తేజ, మేకప్: ఆరవ్, కాస్ట్యూమ్స్: రూప దప్పేపల్లి, ఆర్ట్స్: అజయ్, ఎడిటింగ్: నిఖిల్, రాజేష్, కొరియోగ్రాఫి: కార్తీక్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: నాగ శ్రీహర్ష కశ్యా, ఈ సినిమా ఏప్రిల్ 25 వ తేదీన రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.